
# వీలునామా

–ఎం. ఉమామహేశ్వరరావు



"మనలో చాలా మందికి 'చావు' అంటే చాలా భయం. కారణం జీవించడం అంటే ఏమిటో మనకు తెలీదు. ఏ విధంగా జీవించాలో తెలీదు. కనుక ఏ విధంగా మరణించాలో కూడా మనకు తెలీదు. జీవితాన్ని గురించి మనం భయపడుతున్నంత కాలం మృత్యువు గురించి కూడా భయపడుతూనే ఉంటాం."




ఆంధ్రుడై వుండి, విశ్వమానవుడైన జిడ్డు క్రిష్ణమూర్తి గారి ఉపన్యాసం పదే పదే మనస్సులోకి రావడంతో ఆ రాత్రంతా అదే ఆలోచిస్తూండి పోయాడు రామచంద్రయ్య. కంటికి నిద్ర రాలేదు. మనస్సును పదే పదే స్పర్శిస్తూ, ఏదో అర్థంకాని మార్గం వైపు మళ్ళించబోతున్న ఆ ఉపన్యాసం ఆయనలో చాలా ప్రభావం చూపించసాగింది.

ఆ ప్రక్కనే మరో మంచం మీద నిద్రబోతున్న ఆయన అర్థాంగి జానకమ్మ తెలివిపడి చూసింది. కళ్ళు తెరచి ఏదో ఆలోచిస్తూనే ఉన్న భర్తను సమీపించింది.

''నిద్ర పట్టలేదా? ... కళ్ళు గట్టిగా మూసుకోండి! అదే వస్తుంది నిద్ర!'' అంది సానుభూతిగా.

''కళ్ళు మూసుకున్నా మనస్సు తలుపులు ఎట్లా మూయడం? రెక్కలు విప్పుకున్న పక్షిలా ఉంది మనస్సు'' అన్నాడు.

నిట్టూర్చిందామె. భర్తలో రోజు రోజుకీ మృత్యువు మీద ఆలోచన పెరిగిపోతున్నట్టు ఆమె ఏనాడో గ్రహించింది. గత పదిహేను రోజులుగా మంచం మీదనే ఉన్నాడు. కుడికాలు, కుడిచేయికి పక్షవాతం వచ్చి పడిపోయాయి. లేవలేడు, ఏదీ చేయలేడు. పదిహేను రోజులలోనూ బాగా నీరసపడిపోయాడు.

''డాక్టరు గారు ఇవ్వేళ వచ్చి చూశారు గదా! ఏమన్నారు?'' ప్రశ్నించాడు జానకమ్మను. అతనిలో లేచి మామూలుగా తిరగాలన్న కోరిక మాత్రం పెనుభూతమై కూర్చుంది.

''ఏం ఫర్వాలేదన్నారు. నెల రోజుల్లో మీరు మళ్ళీ మామూలుగా లేచి తిరుగుతారని చెప్పారు. వ్రాసిచ్చిన మందులు టైం ప్రకారం వాడాలన్నారు'' అంది ఇంకేమనాలో అర్థంగాక.

తన సమాధానం రామచంద్రయ్యలో కాస్త తృప్తి కలిగించినట్టు ఆయన చూపులే చెప్పేయామెకు. భార్యను దగ్గరగా రమ్మని సైగచేశాడు. దగ్గరగా వచ్చి, అతని మంచం మీద కూర్చుంది.

''వాళ్ళొచ్చేరా నన్ను చూడ్డానికి? పదిహేను రోజులయింది గదా! ఈ రోగంతో నేనెలా వున్నానో వాళ్ళకేం పట్టలేదా?'' అడిగాడు జానకమ్మను.

> ''కళ్ళు మూసుకున్నా మనస్సు తలుపులు ఎట్లా మూయడం? రెక్కలు విప్పుకున్న పక్షిలా ఉంది మనస్సు''

గుండెల్లో రాయి పడిందామెకు. ఏదైతే భర్త దృష్టికి రానివ్వకూడదని భావించిందో అదే వచ్చిందిప్పుడు. ఈ ప్రశ్నకు జవాబు చెప్పడానికి ఆమెకు నోరు రాలేదు.

ఆమెనే చూస్తున్నాడు రామచంద్రయ్య.

''వస్తారు... వస్తామన్నారు.. ఏదీ వాళ్ళిప్పుడు ఊళ్ళో లేరుగదా!! కేంపుల కెళ్ళారు. రావడానికి మరో వారం రోజులు పడుతుంది. వచ్చిన వెంటనే వచ్చేస్తారు. మిమ్మల్ని చూడందే వాళ్ళుండగలరా? ... మన బిడ్డలు గదా వాళ్ళు!''

జానకమ్మ జవాబులోని కంగారు, గాబరా నవ్వు తెప్పించాయి రామచంద్రయ్యకు.

''ఈ బొందిలోంచి ప్రాణాలు పొయ్యేలోగా వాళ్ళొస్తారని నేననుకోను. వాళ్ళకు నేనంటే అసహ్యం, కోపం. ఈ ఆస్తిని దానధర్మాలకింద తగలేస్తున్నానని కోపంతో వాళ్ళున్నారు. అందుకే వాళ్ళు రాలేదు. రారు నాకు తెలుసు'' గొణిగాడు రామచంద్రయ్య.

''అలా ఎందుకు భావిస్తారు? ఈ ఆస్తి మీ కష్టార్జితం. మీరెలా చేసుకోవాలనుకుంటే అలా చేస్తారు'' అంది జానకమ్మ.

జానకమ్మ మాటలు వింటూ నిశ్శబ్దంగా తల పంకించాడు రామచంద్రయ్య. ఎప్పటికోగాని నిద్రలోకి జారుకోలేదు. ఆమెక్కూడా అంతే. తెల్లవారు ఝామున ఎప్పుడో చిన్న కునుకు పట్టింది.

ooo

రామచంద్రయ్య సమాజంలో ఓ స్థాయినందుకున్న వ్యక్తి. తాను ఉన్నత స్థాయిలో నివసిస్తూ కూడా నిమ్న వర్గాల పట్ల జాలి, ఆప్యాయత, కనబర్చేవాడు. ఆయన జీవితంలో ఎన్నో మంచి గుణాలకు తోడు కొన్ని చెడు గుణాలూ ఉన్నాయి. ఆయనకు ముక్కోపం. కోపం వచ్చిందంటే ఎలాంటి వాడినైనా చెడామడా తిట్టిపోసేవాడు. తాననుకున్నది జరక్కపోతే వెర్రెక్కిపోతాడు.

రామచంద్రయ్య మొదటి భార్య సావిత్రి. ఆమెకు పిల్లల్లేరు. ఎన్నో గుళ్ళూ, గోపురాలకు పోయి పూజలు చేసింది. ఎన్నో నదుల్లో స్నానాలాచరించి పూజలు చేసింది. లాభం లేకపోవడంతో, ఇక పూజలూ - పునరస్కారాల వల్ల ఫలితం లేదనుకున్నాక ఎందరో డాక్టర్లకు చూపించుకుని, వేలకొద్దీ రూపాయలు ఖర్చు చేసింది. లాభం లేకపోవడంతో మానసికంగా కృంగిపోయింది. బెంగతో చిక్కి శల్యమైంది. చివరికి ఓ రోజు రామచంద్రయ్యను మరో పెళ్ళి చేసుకునైనా వంశాన్ని ఉద్ధరించుకొమ్మని సలహానిచ్చి ప్రాణాలు విడిచింది.

లక్షలాది రూపాయలు విలువచేసే ఇల్లూ - వాకిలీ, ఇంకా ఇతరత్రా ఆస్తికి వారసులు లేకపోవడంతో రామచంద్రయ్యలో విచారం మొదలైంది. సరిగ్గా అదే సమయంలో జానకమ్మ తటస్థపడింది.

రామచంద్రయ్యకు స్వయానా అక్క కూతురు జానకమ్మ. రామచంద్రయ్యకు మేనగోడలు కూడా. ఆమె భర్త చనిపోవడంతో, ఆమెకోదారి చూపించాలని భావించాడు. తన ఇల్లాలిగా తన గడపలోకి రానిచ్చాడు.

పెళ్ళయి మూడేళ్ళు తిరక్కుండానే ఇద్దరు పిల్లల్ని కన్న జానకమ్మ భర్త అన్యాయం చేసిపోయినా, గుండె నిబ్బరం చేసుకుని, చంటి పిల్లలతో మేనమామ ఇంట అడుగుపెట్టింది.

ooo

'మరణించడం చాలా కష్టం. కాని జీవించడం

అంతకన్నా కష్టం. మరణం సమీపిస్తోంది నాకు అను కుంటూ జీవించడం ఇంకా కష్టం.'

రామచంద్రయ్యలో 'చావు' పట్ల అనేక ఆలోచ నలు ముసురుకోసాగాయి. జిడ్డు క్రిష్ణమూర్తి గారన్న ట్లుగా జీవితం గురించి భయపడుతున్నప్పుడు చావు గురించీ భయమేస్తుంది. అందుకే తానిప్పుడు మర ణశయ్య మీదున్నానని అనుకుంటూ తానేం చెయ్యాలో ఆలోచించసాగాడు.

''విల్లు రాయించాలని వుంది జానకీ! ... మన లాయరుకు కబురుపెట్టి ఈవేళే రమ్మని చెప్పు!'' అన్నాడు రాజు. అవాక్కయిందామె.

''ఇప్పుడంతవసరమేమొచ్చింది? ... పిల్లల్ని కూడా రానీయండి'' అంది ఇంకేమనాలో తెలీక.

''పిల్లలా? ... ఏ పిల్లలు? .. ఎవరి పిల్లలు?'' ప్రశ్నించాడు. జానకమ్మకు కళ్ళవెంట నీళ్ళు తిరి గాయి. పరిస్థితి చేయి జారిపోతున్న ఈ సమయం లో ఎలాగైనా ఆయన్ను ఓ రెండ్రోజులు ఆపగలి గితే? ... ఈ లోపు వాళ్ళొస్తారు అనుకుంది.


''ఏదో కోపంతో, తాత్కాలిక ఆవేశంతో వాళ్ళు ప్రవర్తించారని మనమూ అలాగే చేస్తామా? ... వాళ్ళెవరి పిల్లలు? .. మన పిల్లలు. ఎంతో ప్రేమ తో మీరు పెంచిన పిల్లలు'' అంది.

రామచంద్రయ్యలో ఆ సమాధానం ఏ స్పంద నసూ తేలేకపోయింది.

''జానకీ! ... తండ్రిలేని లోటుతీర్చి, వాళ్ళను నా కన్న బిడ్డలుగానే చూశాను. నీ మెడలో తాళి కట్టకపోయినా, పీటలమీద మన పెళ్ళి జరక్కపో యినా, ఏ అరమరికలు చూపకుండా నిన్ను నా భార్యగానే చూశాను. నాకు పూర్వం, మా నాన్న గారు గాని, ఆయనకు పూర్వం మా తాతగారు గాని ఈ వంశ పరువూ - ప్రతిష్ఠల్ని పెంచుకున్నారే గాని నష్టపరచలేదు ...

... నిజానికి నేను ఖర్చు చేసింది చాలా తక్కువ. మనిషిగా పుట్టి, ఆ భగవంతుడిచ్చిన సంప దలో కొంత పేదలకు ఖర్చుపెట్టాను. స్కూళ్ళలో పేద పిల్లలకు ఉచితంగా చదువులు చెప్పించాను. కాని ఎన్నడూ చెడ్డ పనులకు డబ్బు వృధా చేయలేదు. నేను తండ్రిని గాకపోయినా నీ బిడ్డలను చేరదీసి, వాళ్ళకు పెద్ద పెద్ద చదువులతో పాటుగా - మంచి ఉద్యోగాలు వేయించాను. మన స్టేటస్‌కు సంబంధించి పెళ్ళిళ్ళు చేశాను. ఇప్పుడు వాళ్ళు చూడు ...

... తమను ఇంత వాళ్ళను చేసిన ఈ మనిషి మీద కూసింతైనా ప్రేమ చూపించారా? వాళ్ళ పట్ల నా బాధ్యత నేను నెరవేర్చినట్టే, వాళ్ళు వాళ్ళ బాధ్యత నెరవేర్చారా? ... '' సూటిగా ప్రశ్నించే భర్తను కళ్ళెత్తి




చూడలేక తలదించుకుంది జానకమ్మ. ఆమెకాసమ యంలో కొడుకులపై కోపం వచ్చింది. నిజానికి రామచంద్రయ్యకు పక్షవాతం వచ్చిన సమయంలో వాళ్ళు ఏ కేంపుకీ వెళ్ళలేదు. విషయం తెలిసి కూడా, ఆ మరునాడే కేంపులంటూ అత్త వారిళ్ళకు భార్యల్తో సహా ఉడాయించారు. ఇప్పుడేం చేయాలో ఆమెకు తోచలేదు. నిశ్శబ్దంగా ఉండిపోయింది గుడ్ల మ్మట నీళ్ళు కుక్కుకుంటూ.

ooo

ఏ ఒక్కరూ చావుకి అతీతులు కారు. ప్రతి వాళ్ళూ ఎప్పటికో ఒకప్పటికి మరణిస్తారు. అలా పోయిన వాళ్ళల్లో ఎక్కువ మందిని కొంతమందే స్మరిస్తారు. కొద్ది మందిని మాత్రం ఎక్కువ మంది స్మరిస్తారు.

రామచంద్రయ్య ఆ కొంత మందిలో ఒకరుగా, ఎక్కువ మంది స్మరించే కొద్ది మందిలో వ్యక్తిగా నిలిచిపోయాడు తను వ్రాసిన 'వీలునామా'లో.

తన పూర్వీకుల నుంచి తనకు సంక్రమించిన విశాలమైన తన భవంతిని జానకమ్మ పేరున రాసే శాడు. ఆమెతో పాటుగా - ఆమె కొడుకులు తమ తమ భార్యా, పిల్లలతో స్వేచ్ఛగా అందులో ఉండ వచ్చును. ఇక ఆమె మరణించిన పిమ్మట ఆ భవం తిని మాత్రం, వయస్సుడిగిన ముసలివాళ్ళు, కన్న బిడ్డల నిరాదరణతో వీధినపడిన వాళ్ళకోసం వృద్ధుల సంక్షేమ సంఘానికి ధారాదత్తం చేయవలసిందిగా పేర్కొన్నాడు. జానకమ్మ బ్రతికున్నంత కాలం ఆమెకు 'భుక్తి'లో ఏ లోటూ రాకుండా రైతుల నుంచి వచ్చే శిస్తులు వగైరాల ఆదాయం ఆమె అనుభ విస్తుంది. ఆమె పోయాక ఆ రైతులు శిస్తులు వగై రాలు చెల్లించనక్కర లేకుండా వాళ్ళు చేసుకుం టున్న భూములకు వాళ్ళే హక్కుదార్లవుతారు.

ఇక చివరగా తన పేర్న ఉన్న ఇంకా కొన్ని ఇళ్ళు, భూములపై ఆదాయం వగైరాలను జానకమ్మ అనుభ విస్తుంది. ఆమె పోయాక ఆ రైతులు శిస్తులు వగై రాలు చెల్లించనక్కరలేకుండా వాళ్ళు చేసుకుంటున్న భూములకు వాళ్ళే హక్కుదార్లవుతారు.

ఇక చివరిగా తన పేర్న ఉన్న ఇంకా కొన్ని ఇళ్ళు, భూములపై ఆదాయం వగైరాలను జానికమ్మ అను భవిస్తుంది. ఆమె పోయాక ఆమె కొడుకులకు పుట్టిన పిల్లలకు అంటే ఆమె మనుమలకు చెందు నట్టుగా రాసి సంతకం చేశాడు వీలునామాలో.

రామచంద్రయ్య చనిపోయిన రోజు హడావుడి గా పరిగెత్తుకొచ్చారు జానికమ్మ కొడుకులు. వీలు నామా విషయం తెలిసి, ఆయనకు 'తలకొరివి' పెట్టడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. జానకమ్మ ఎంత బ్రతిమాలినా వాళ్ళు వినలేదామె మాటల్ని. ఆ సమయంలో వీలునామా రాసిన 'లాయరు' వచ్చాడు.

''రామచంద్రయ్య గారు తన వీలునామాలో చివర్న ఓ విషయం స్పష్టంగా రాయించేరమ్మా! అదేంటంటే ...

నా వీలునామా చూశాక వాళ్ళు నాకు తల కొరివి పెట్టరు. పెట్టకపోతే ఎవరూ వాళ్ళను బల వంతం చేయవద్దు. నా చితిని పేర్చే కాటికాపరి చేత తలకొరివి పెట్టించండి. ఆ తరువాత వాడికి మనూరి చివర్లో ఉన్న విశాలమైన నా 'పెంకుటిల్లు' నా 'కానుక'గా ఇచ్చేయండి!''

రామచంద్రయ్య వీలునామా విషయం చెప్పి, జానకమ్మ వంక చూశాడు 'లాయరు'. ఆవిడేం మాట్లాడలేదు.